సాక్షి
వనపర్తి
బుధవారం, 11, డిసెంబర్, 2024



'పట్టాల'పై ప్రజల పాట్లు
దేవరకద్రలో రైల్వే గేటు మూసివేయడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.
వివరాలు 10లో ▸



దీక్ష విరమణ ఉత్సవాలు
మద్దిమడుగులో హనుమద్ దీక్ష విరమణ ఉత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి.
వివరాలు 12లో ▸

గరిష్టం/కనిష్టం
34.1 /20.0
వాతావరణం
ఉదయం, రాత్రి వేళ చలి తీవ్రత పెరుగుతోంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

లక్ష్యం.. భారం!

జిల్లాలో భారీగా పెరిగిన మద్యం విక్రయ టార్గెట్

- గతేడాది డిసెంబర్‌లో రూ.48 కోట్ల అమ్మకాలు
- ఈ ఏడాది అదనంగా రూ.10 కోట్లు పెంచాలని అధికారుల మౌఖిక ఆదేశాలు?
- జిల్లాలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న దుకాణ దారుల ఒత్తిడి



వనపర్తి: నూతన సంవత్సర వేడుకల పేరిట ఈ నెలలో మద్యం విక్రయాల లక్ష్యాన్ని ప్రభుత్వం భారీగా పెంచినట్లు ఎక్సైజ్‌శాఖలో చర్చ వినిపిస్తోంది. గతేడాది మద్యం విక్రయాల విలువకు 25 శాతానికి తగ్గకుండా ఎక్సైజ్‌శాఖ అధికారులు ఇటీవల లక్ష్యం విధించినట్లు తెలుస్తోంది. గతేడాది ఎన్నికల హడావుడి ఉండటంతో మద్యం విక్రయాలు భారీగా జరిగాయి. ఆ విషయాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులు పరిగణలోకి తీసుకోకుండా లక్ష్యం విధించారు. గతేడాది డిసెంబర్‌లో జిల్లాలో రూ.48 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఈసారి (డిసెంబర్, 2024) అమ్మకాలు రూ.58 కోట్లకు చేరుకోవాలని మౌఖిక ఆదేశాలిచ్చారు. జిల్లాలో మొత్తం 3 ఎక్సైజ్ సర్కిళ్లు ఉండగా.. జిల్లా లక్ష్యంలో 50 శాతం వనపర్తి సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్ల నుంచే సమకూరుతోంది. మిగతా.. కొత్తకోట, ఆత్మకూరు సర్కిళ్ల నుంచి రాబట్టేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. గతేడాది అమ్మకాల ఆధారంగా నెలవారీగా లక్ష్యాలు విధించడంతో 70 శాతం మంది అధికారులు, సిబ్బంది మద్యం అమ్మకాలపై దృష్టి సారిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో బెల్టు దుకాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా.. అమ్మకాల దృష్ట్యా అధికారులు దాడులు నిర్వహించడం లేదని తెలుస్తోంది.

అదనపు లక్ష్యం రూ.10 కోట్లు..?

2023, డిసెంబర్ మద్యం విక్రయాల కంటే రూ.10 కోట్లు అధికంగా అమ్మకాలు జరపాలని ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు లక్ష్యం విధించినట్లు సమాచారం. ఇలా ప్రతినెల 25 శాతానికిపైగా సేల్స్ టార్గెట్ విధిస్తున్నారు. నవంబర్‌లో రూ.38 కోట్ల టార్గెట్ ఉండగా.. గతేడాది కంటే ఎక్కువగా రూ. 1.35 కోట్లు అమ్మకాలు చేయించినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. కాగా.. డిసెంబర్‌లో లక్ష్యం భారీగా ఇచ్చారనే అయోమయం జిల్లా ఎక్సైజ్ అధికారుల్లో నెలకొంది. టార్గెట్లు చేరుకోని ప్రాంతాల్లో ఉన్న అధికారులపై ఇటీవల బదిలీ వేటు వేసినట్లు డిపార్ట్‌మెంట్‌లో చర్చ కొనసాగుతోంది. గతేడాది టెండర్లు నిర్వహించడంతో అత్యధికంగా మద్యం విక్రయాలు అయ్యాయి. అదే తరహాలో ఈసారి చేయాలంటే ఎలా అనే ఆందోళనలో ఎక్సైజ్‌శాఖ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అధికారులు నోరు విప్పడానికి జంకుతున్నారు.

జిల్లాలో 37 దుకాణాలు, 8 బార్లు..

గతేడాది అక్టోబర్‌లో జిల్లాలోని 37 దుకాణాల నిర్వహణకు రెండేళ్ల కాలపరిమితితో టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. ప్రతి సర్కిల్‌లోని మద్యం దుకాణదారులు సిండికేట్‌గా మారి ఒక దుకాణం నుంచి గ్రామాల్లోని బెల్టు షాపులకు యథేచ్ఛగా మద్యం సరఫరా చేస్తూ నెలవారి లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. సంబంధితశాఖ అధికారులు కూడా మరో దారిలేక అనధికారికంగా బెల్టు షాపుల నిర్వహణకు సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏ డాది కాలంలో బెల్టుషాపులపై దాడులు చేసి కేసులు చేసిన ఘటనలు జిల్లావ్యాప్తంగా చాలా అరుదుగా ఉన్నాయని చెప్పవచ్చు.

ఒత్తిడి లేదు..

ఉన్నతాధికారుల నుంచి మద్యం విక్రయాల లక్ష్యాలు ఉంటాయి. మునుపటిలా వత్తిడి ఏమీలేదు. కానీ ప్రతి నెల కొద్దిమేర విక్రయాలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో 2023, నవంబర్ కంటే అమ్మకాలు ఎక్కువగానే జరిగాయి. మద్యం అక్రమ విక్రయాలతో పాటు కల్తీ కల్లు, సారా విక్రయాలపై టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసి కట్టడి చేస్తున్నాం.

– శ్రీనివాస్,
ఎక్సైజ్ సూపరింటెండెంట్, వనపర్తి

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. చిత్రంలో జిల్లా అధికారులు

వనపర్తి: విద్యార్థుల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యాసంస్థలో విద్యార్థులను మోటివేట్ చేసేందుకు కొంత సమయం కేటాయించాలని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు ప్రయత్నించాలని, ఆందోళన, నిరాశకు లోనైన వారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా ముగ్గురు అధ్యాపకులను నియమించాలన్నారు. విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెంపొందించేందుకు అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులు ఎవరైనా ఒంటరిగా ఉన్నా.. డిప్రెషన్‌కు గురైనట్లు గుర్తిస్తే అందుబాటులో ఉన్న సైకాలజీ విభాగం సిబ్బంది సేవలు వినియోగించుకోవాలని సూచించారు. గెలుపోటములను అంగీకరించే విధంగా వారి మానసిక స్థితిని మలిచే బాధ్యత అధ్యాపకులు తీసుకోవాలన్నారు. దీంతో విద్యార్థుల ఆత్మహత్యలను నివారించవచ్చని, మానసిక ఆరోగ్య సమస్యల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14416, బాలల సమస్యల గురించి నివేదించడానికి 1098 నంబర్లను వినియోగించుకోవాలని చెప్పారు. అన్ని విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీని ఏర్పాటు చేయాలని, వసతిగృహాల్లో విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో అధికారుల పర్యవేక్షణ ఉండాలని కోరారు. సరుకులు వచ్చినప్పుడు మెస్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పరిశీలించాలన్నారు. తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్ నిర్వహణ ఉండేలా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి డా. శ్రీనివాసులు, డీఐఈఓ అంజయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. రంగారావు, సంక్షేమ శాఖల అధికారులు, సంక్షేమ శాఖల విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ..

త్రైమాసిక తనిఖీల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని ఈవీఎం గోదాంను మంగళవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి సందర్శించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి రికార్డులు, సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలకు 2,366 పోలింగ్ కేంద్రాలు



మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు

వనపర్తి: త్వరలో నిర్వహించే గ్రామపంచాయతీ ఎన్నికల కోసం జిల్లావ్యాప్తంగా 2,366 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని 260 గ్రామపంచాయతీల్లో ఉన్న 2,366 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా.. ప్రతి వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలలు, ఇతర భవనాలను గుర్తించినట్లు తెలిపారు. ఇందులో 200లోపు ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు 1,700, 201 నుంచి 400 వరకు ఓటర్లున్న కేంద్రాలు 652, 401కిపైగా ఓటర్లున్న కేంద్రాలు 14 ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల విషయంలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలుపామని కోరారు. డిసెంబర్ 12న మండలస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ యాదయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో సీఎం కప్ మండలస్థాయి క్రీడలను మండల ప్రత్యేక అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి తల్లిదండ్రులు, పుట్టిన ఊరుకు, విద్యనందించిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చక్కటి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి జిల్లాస్థాయికి ఎంపిక చేయాలని పీఈటీలకు సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జయశంకర్, ఎంపీడీఓ వెంకటాచారి, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు కాళిదాసు, చెన్నప్ప, పీఈటీలు దేవేందర్, చందర్, శ్రీనివాసులు, శైని, గ్రామ పెద్దలు సాయిచరణ్‌రెడ్డి, ఆగారం ప్రకాశ్, రవి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ యాదయ్య తదితరులు

సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి

పాన్‌గల్: తెలంగాణ ప్రభుత్వం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా మాదిగలను మోసం చేస్తోందని ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొలకలపల్లి పరశురాముడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంఘం కార్యవర్గ ఎన్నికకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 17న పాలమూరు యూనివర్సిటీలో ఉమ్మడి జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని.. మాదిగ ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులు, నిరుద్యోగులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంఎస్‌ఎఫ్ కళాశాల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

హక్కుల రక్షణతోనే మెరుగైన సమాజం



పెద్దమందడి మానవహారంలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని

కొత్తకోట రూరల్: మానవ హక్కుల రక్షణతోనే మెరుగైన సమాజం రూపుదిద్దుకుంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.రజని అన్నారు. మంగళవారం పెద్దమందడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ప్లకార్డులు చేతబట్టుకొని మానవ హక్కులను కాపాడాలంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు చేశారు. మానవహారంగా ఏర్పడి హక్కులను కాపాడుకుందామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సమాజ హితానికి ఉపయోగపడే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చట్టాలను గౌరవించడం మన బాధ్యతగా భావించాలని.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శిక్షార్హులవుతారన్నారు. సదస్సులో న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు డి.కృష్ణయ్య, మండల విద్యాధికారి బాణం విష్ణు, ప్రధానోపాధ్యాయుడు శాంతన్న, ఉపాధ్యాయులు, శ్రీధర్, భద్రునాయక్, బాలాజీ, మన్యం యాదవ్, మల్లికార్జున్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలోని పీజీ కళాశాలలో..

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని మాట్లాడుతూ.. లోక్ అదాలత్ సంస్థ ఆధ్వర్యంలో పలువర్గాల ప్రజలకు ఉచిత న్యాయసేవలు అందుతున్నాయని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. న్యాయసేవలు పొందేందుకు ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్ 15100 ఏర్పాటు చేశారన్నారు. పిల్లలు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తే అందుకు బాధ్యులైన వారికి చట్టపరమైన శిక్షలు ఉంటాయన్నారు. సదస్సులో సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత, ప్రిన్సిపాల్ భగవంత్‌రెడ్డి, ఖాజమైనుద్దీన్, బలేశ్వర్‌రెడ్డి, శివాదిత్య పాల్గొన్నారు.

నేరాల కట్టడికి చర్యలు

ఎస్పీ రావుల గిరిధర్

ఆత్మకూర్: పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని.. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్పీ రావుల గిరిధర్ కోరారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించగా సీఐ శివకుమార్, ఎస్‌లు నరేందర్, సురేశ్ పుష్పగుచ్ఛం అందజేయగా సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఠాణా ఆవరణలో మొక్కలు నాటి స్టేషన్‌లోని లాకప్, రిసెప్షన్, మెన్ బ్యారక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలించారు. రహదారి ప్రమాదాలు, నేరాలు, అట్రాసిటీ కేసులు, పాత నేరస్తుల వివరాలను సీఐ, ఎస్‌ఐని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, న్యాయబద్ధంగా చట్టాలను అమలు చేయడమేగాక స్వయంగా పాటిస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. నిత్యం పెట్రోలింగ్, వాహన తనిఖీలు చేపట్టాలని, డయల్ 100 ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై కఠినంగా వ్యవహరించాలని, నిత్యం అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాల్లో ఏర్పాటు చేసుకొనేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. ఏఎస్‌ఐ రోషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

న్యాక్‌కు పీయూ సన్నద్ధం

త్వరలోనే పాలమూరు యూనివర్సిటీని సందర్శించనున్న బృందం

- గతం కంటే మెరుగుపడిన వసతులు
- న్యాక్‌కు పూర్తి వివరాలతో రిపోర్టు ఇచ్చేందుకు కమిటీల ఏర్పాటు
- ఏ ప్లస్ గ్రేడింగ్ సాధించేందుకు ప్రయత్నం
- ఇప్పటికే వివిధ కేంద్ర సంస్థల నుంచి గుర్తింపు



పాలమూరు యూనివర్సిటీ ముఖద్వారం



పీయూలో వివిధ విభాగాల హెచ్‌ఓడీలతో సమావేశమైన వీసీ జీఎన్ శ్రీనివాస్ (ఫైల్)

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా విద్యార్థుల వరప్రదాయిని పాలమూరు యూనివర్సిటీ. ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తూ.. ఏడాదికేడాది మరింత విస్తరిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో మరో పరీక్షకు పీయూ సిద్ధమైంది. ఈనెల రెండో వారం నుంచి వచ్చే నెలాఖరులోగా న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం పీయూను సందర్శించనుంది. మూడు రోజుల పాటు ఆకస్మిక తనిఖీలు చేపట్టనుంది. అయితే ఇప్పటికే పీయూ అధికారులు ఆన్‌లైన్‌లో యూనివర్సిటీకి సంబంధించిన అన్ని అంశాల వివరాలను న్యాక్‌కు అందించారు. ఈ వివరాలు వాస్తవంగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని సంబంధిత అధికారులు పరిశీలించనున్నారు. 2018లో మొదటిసారి పీయూకు 'బీ' గ్రేడ్ రాగా.. ఈ సారి ఏ ప్లస్ సాధించే విధంగా అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలు కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి వివిధ గుర్తింపులు పొందిన పీయూకు న్యాక్ గ్రేడింగ్ పెరిగితే.. పనితీరుకు ఒక గుర్తింపు లభించడంతో పాటు రాష్ట్రంలోని పెద్ద యూనివర్సిటీల సరసన స్థానం పొందనుంది. పీయూ అభివృద్ధికి ప్రతి సంవత్సరం రూ.10 కోట్లకు పైగా వచ్చే అవకాశం ఉంది. పీయూ పరిధిలో వివిధ కళాశాలలు 120 వరకు ఉండగా.. 35 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు.

గ్రేడింగ్ పెరిగితే ప్రయోజనం..

యూనివర్సిటీకి గ్రేడింగ్ పెంచేందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఐక్యూఏసీ (ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంట్) సెల్ ఆధ్వర్యంలో వివిధ డిపార్ట్‌మెంట్ల అధ్యాపకుల సమక్షంలో ఐదేళ్లుగా చేసిన వివిధ యాక్టివిటీస్‌కు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. అందులోభాగంగా స్పోర్ట్స్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ యాక్టివిటీస్, క్యాంపస్ సెలక్షన్స్, హాస్టల్స్ విద్యార్థులకు అందిస్తున్న వసతులు, లైబ్రరీలు, గ్రౌండ్, పీహెచ్‌డీ వివరాలతో పాటు వివిధ సెమినార్‌లు తదితర వివరాలను సేకరిస్తున్నారు. గతంలో ఉన్న వసతుల కంటే ఇప్పుడు మెరుగుపడిన నేపథ్యంలో ఏ ప్లస్ గ్రేడింగ్ వస్తే.. యూనివర్సిటీలో సొంతంగా డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్‌లు ఏర్పాటు చేయవచ్చు. అంతర్జాతీయ యూనివర్సిటీతో ఎంఓయూలు చేసుకోవడం.. పీహెచ్‌డీ సీట్లు భర్తీ చేసుకోవడం.. పెద్ద ఎత్తున నిధులు రావడం వంటి ప్రయోజనాలు కలగనున్నాయి. వివిధ రీసెర్చ్ ప్రాజెక్టులు రావడంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

ఇప్పటికే పొందిన గుర్తింపులు..

- పీయూలో మొదటిసారిగా 2018లో నిర్వహించిన న్యాక్ తనిఖీల్లో బీ-గ్రేడ్ సాధించగా.. రూసా (రాష్ట్రీయ ఉచ్చత్తర్ శిక్షా అభియాన్) ద్వారా యూనివర్సిటీకి రూ.20 కోట్లు మంజూరయ్యాయి.
- 2015లో పీసీఐ (ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) నుంచి గుర్తింపు రావడంతో యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాలను ప్రారంభించారు. పీయూ పరిధిలో డీ ఫార్మా, బీ ఫార్మా కోర్సులు అందిస్తున్నారు.
- 2016లో యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల అఫ్లియేషన్స్, వసతులను దృష్టిలో ఉంచుకుని 12బీ గుర్తింపును యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) ప్రకటించింది.
- పీయూలో ఎంఈడీ కోర్సులను ప్రవేశపెట్టేందుకు 2015లో ఎన్‌సీఈటీ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచింగ్ ఎడ్యుకేషన్) గుర్తింపు లభించింది. దీంతో పీయూలో ఎంఈడీ కళాశాలను ప్రారంభించింది. బీఈడీ పూర్తి చేసిన వారికి ఎంఈడీ విద్య అందిస్తున్నారు. పీయూ పరిధిలో బీఈడీ కోర్సులను కూడా అందిస్తున్నారు.
- 2023లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి లా డిపార్ట్‌మెంట్ ఏర్పాటుకు అనుమతి వచ్చింది. దీంతో పీయూ పరిధిలోని వనపర్తి ప్రైవేటు కాలేజీలో లా కళాశాలను ఏర్పాటు చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీయూలో కూడా లా అడ్మిషన్లు ఇవ్వనున్నారు.
- ఇంజినీరింగ్ కళాశాలను కూడా పీయూలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేసింది. అయితే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ అడ్మిషన్లు ఇవ్వనున్న నేపథ్యంలో ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్)కు దరఖాస్తులు చేయనున్నారు. కళాశాల ప్రారంభించిన నాలుగేళ్లలో ఈ గుర్తింపు రానుంది.

ఉత్తమ గ్రేడింగ్ సాధించేందుకు చర్యలు..

గతంలో వచ్చిన గ్రేడింగ్ కంటే ఉత్తమ గ్రేడింగ్ సాధించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే నెల వరకు న్యాక్ బృందం యూనివర్సిటీకి రానుంది. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఐదేళ్లతో పోల్చితే అనేక అభివృద్ధి పనులు జరగడం వల్ల న్యాక్ తనిఖీల్లో ఉత్త మ గ్రేడింగ్ సాధిస్తాం. రూసా నుంచి మంచి నిధులు వచ్చే విధంగా సిబ్బందితో కలిసి కృషి చేస్తాం. విద్యార్థులకు పూర్తి స్థాయిలో వసతులు, నాణ్యమైన విద్య అందించేందుకు పాటుపడతాం.

– జీఎన్ శ్రీనివాస్, వైస్‌చాన్స్‌లర్, పీయూ

న్యూస్‌రీల్

తపాలాశాఖలో ప్రమాద, ఆరోగ్య బీమా



వనపర్తి టౌన్: ఐపీపీబీ ద్వారా పేదలు, రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రమాద, ఆరోగ్య బీమాలను తపాలాశాఖ అందిస్తోందని వనపర్తి ప్రధాన తపాలా కార్యాలయ సూపరింటెండెంట్ భూమన్న తెలిపారు. మంగళవారం కార్యాలయంలో ఐపీపీబీ బీమా కరపత్రాలను ఉద్యోగులతో కలిసి విడుదల చేసి మాట్లాడారు. కూలీలు, ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు పోస్టాఫీసుల్లో ప్రమాద, ఆరోగ్య బీమా పొందవచ్చని వెల్లడించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స కోసం ఆరోగ్య బీమా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రమాద బీమాతో రూ.10 లక్షల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందుతుందని తెలిపారు. వనపర్తి, షాద్‌నగర్, కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, అచ్చంపేటలో త్వరలోనే అప్డేట్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వనపర్తిలోని రైల్వే బుకింగ్ కౌంటర్ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు తగిన సాంకేతికత కోసం రైల్వేశాఖకు విన్నవించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐపీపీబీ మేనేజర్ రాజశేఖర్, తపాలా ఉద్యోగులు శిరీష, గీత తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలో 'నవోదయ' ఏర్పాటు చేయాలి



కొత్తకోట: పాలమూరు జిల్లాకు మంజూరైన నవోదయ విద్యాలయను దేవరకద్ర నియోజవర్గంలో ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని పుర చైర్‌పర్సన్ పొగాకు సుఖేసిని నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం తెలంగాణకు 7 నవోదయ విద్యాలయాలు మంజూరు చేయగా అందులో ఒకటి మహబూబ్‌నగర్ జిల్లాకు రావడం ఆనందంగా ఉందన్నారు. గతంలో మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర మంత్రిని కలిసి దేవరకద్ర నియోజకవర్గంలో నవోదయ విద్యాలయను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశామని.. మా ప్రయత్నం, కృషితోనే మంజూరైందని గుర్తు చేశారు. ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దేవరకద్ర నియోజకవర్గంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుంత మౌనిక, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వామన్‌గౌడ్, మాజీ సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుఖేసిని, కొండారెడ్డి, కౌన్సిలర్లు ఖాజా మైనుద్దీన్, నాగన్న, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్షలు



వనపర్తి విద్యావిభాగం: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు జిల్లాకేంద్రంలో చేపడుతున్న రిలే దీక్షలు మంగళవారం 4వ రోజుకు చేరాయి. దీక్ష శిబిరాన్ని మంగళవారం సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరాలకు బంగారు బాటలు వేసే విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేకుండా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 19,600 మంది పని చేస్తున్నారని.. వారి న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు అప్పటి వరకు పే స్కేల్ వర్తింపజేయాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ సమయంలో బెనిఫిట్స్ కిందద రూ.20 చెల్లించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌పై నుంచి పడి యువకుడి దుర్మరణం


శివ(ఫైల్)

పెద్దకొత్తపల్లి: ద్విచక్ర వాహనంపై నుంచి పడి యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం పెద్దకార్పాములలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దకార్పాముల గ్రామానికి చెందిన హరిగెల శివ(22) అదే గ్రామానికి చెందిన యువకుడు మహమ్మద్ ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం పెద్దకొత్తపల్లికి వచ్చారు. తిరిగి అర్ధరాత్రి పెద్దకార్పాములకు వెళ్తుండగా, బైక్ అతి వేగంగా వెళ్తుండగా వెనుక ఉన్న శివ ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయాలు అయ్యాయి. శివను చికిత్సం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. యువకుడి తల్లి అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

మహబూబ్‌నగర్ క్రైం: పంటకోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని అప్పాయిపల్లి శివారులో రైతు వేరుశనగ పంటకు అడవి పందుల నుంచి రక్షణ కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని యువకుడు(30) విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం స్థానిక రైతులు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. యువకుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత బలవన్మరణం

- రెండేళ్ల కిందటే ప్రేమ వివాహం
- మృతిపై అనుమానాలు?


పవిత్ర (ఫైల్)

గద్వాల క్రైం: ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం మేరకు.. మల్దకల్ మండలం మద్దెలబండకు చెందిన పవిత్ర (23) ఇంజినీరింగ్ చదువు పూర్తిచేసి అదే గ్రామానికి చెందిన వినయ్‌ని రెండేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ఇద్దరు గద్వాలలోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. కొన్ని రోజుల తర్వాత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం రావడంతో పవిత్ర అక్కడికి వెళ్లగా.. వినయ్ మాత్రం ఇక్కడే కార్పెంటర్‌గా పని చేస్తుండేవాడు. రెండురోజుల క్రితం మృతురాలు భర్త వద్దకు వచ్చి అక్కడే ఉంటుంది. మంగళవారం ఉదయం వినయ్ పనికి వెళ్లిన తర్వాత ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంటికొచ్చిన భర్త తలుపుతట్టి పిలిచినా ఎంతకూ పలుకకపోవడంతో ఆందోళనతో కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. స్థానికుల సాయంతో కిందకు దించి జిల్లా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వరకట్నం కోసం భర్త, ఆయన కుటుంబ సభ్యులు వేధించడంతోనే తన కుమార్తె బలవన్మరణానికి పాల్పడిందని పవిత్ర తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు అయిదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చామని.. ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు.

కొనుగోలు కేంద్రంలో ఏపీ వరిధాన్యం

ఇద్దరిపై కేసు నమోదు

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులను మధ్యదళారుల నుంచి కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రతి గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రభుత్వం రైతుల నుంచి వరిధాన్యం కొనుగోలు చేసి మళ్లీ ప్రతి క్వింటాలుకు రూ.500బోనస్ ఇస్తోంది. అందులో భాగంగా వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పామాపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాటవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ఇన్‌చార్జిగా మైనొద్దీన్‌ను నియమించారు. గ్రామానికి చెందిన ఎద్దుల నాగరాజు, ఎద్దుల నాగేష్‌లు ఈనెల 8న తెల్లవారుజామున కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి అనుమతి లేకుండా రెండు డీసీఎంలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా పెద్దటేకూర్ గ్రామంలోని ఓ రైస్ మిల్లు నుంచి వరిధాన్యం బస్తాలు దించేందుకు ప్రయత్నించాడు. దీన్ని గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సివిల్ సప్లయర్స్ అధికారులకు సమాచారం ఇచ్చి వరిధాన్యాన్ని పరిశీలించారు. తెలంగాణకు సంబంధించిన వరిధాన్యం కాదని తేల్చారు. బోనస్ డబ్బుల కోసం బయటి ప్రాంతాల నుంచి సన్నరకం వరిధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వాన్ని మోసం చేసేందుకు ప్రయత్నించారని ఎద్దుల నాగరాజు, ఎద్దుల నాగేష్‌లపై పీఏసీఎస్ సీఈఓ రాఘవేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

‘పట్టాల’పై ప్రజల పాట్లు

- మహిళలు, వృద్ధులు, విద్యార్థుల ఇబ్బందులు
- ప్రమాదమని తెలిసినా తప్పని తిప్పలు
- నడవడానికి ఉపయోగ పడని ఆర్వోబీ
- అండర్‌పాస్‌పై స్పష్టత కరువు


దేవరకద్ర పట్టణంలో మూసిన రైల్వేగేటు పట్టాలు దాటుతున్న వృద్ధులు, మహిళలు (ఫైల్)

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో గతేడాది జూలైలో రైల్వేగేటు మూసేయడంతో ప్రజలు తప్పని పరిస్థితుల్లో రైల్వే పట్టాలు దాటుతున్నారు. ఆర్వోబీ నిర్మాణంతో దేవరకద్ర పట్టణం రెండుగా విడిపోయింది. ఒకవైపు దేవరకద్ర పాత పట్టణం, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రి, పోలీస్‌స్టేషన్ ఉండగా, మరోవైపు మార్కెట్ యార్డు, హోల్‌సేల్ వ్యాపార కేంద్రాలున్నాయి. దేవరకద్రకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలు గేటుకు అటు ఇటు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతూ పట్టాలు దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిళలు, విద్యార్థులు, నిత్యం వేలాది మంది ప్రజలు పట్టాలు దాటి వెళ్తుంటారు. ఆర్వోబీ నిర్మాణం వల్ల దేవరకద్ర ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. కేవలం దూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే వారికి, అలాగే ఆర్టీసీ బస్సులు, గూడ్స్ లారీలు ఆర్వోబీపై నుంచి వెళ్లడానికి మాత్రమే ఉపయోగకరంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు ఆర్వోబీపై అటు ఇటు వెళ్తుంటారు. కాలినడకన వెళ్లే వారు తప్పని సరి పరిస్థితిలో రైల్వే పట్టాలు దాటాల్సి వస్తోంది.


దేవరకద్రలో రైలు వెళ్తుండగా పట్టాల వద్ద ఆగిన మహిళలు


దేవరకద్రలో మూసిన గేటును పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ(ఫైల్)

సంత రోజు రద్దీ..

ప్రతి బుధవారం దేవరకద్రలో సంతకు వచ్చే ప్రజలు కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్‌కు కూరగాయల మార్కెట్‌కు, ఇతర నిత్యావసర సరుకుల కొనుగోలుకు మూసిన రైల్వేగేటు పట్టాలు దాటి రావాల్సి ఉంటుంది. కోయిల్‌సాగర్ ప్రాంతం నుంచి దాదాపు 20 గ్రామాలు, కౌకుంట్ల ప్రాంతం నుంచి మరో 20 గ్రామాలు, బండర్‌పల్లి రూట్ నుంచి మరో 20 గ్రామాల ప్రజలు కొత్త బస్టాండ్ నుంచి నడుచుకుంటూ పట్టాలు దాటాల్సి ఉంటుంది. ఇక ఆస్పత్రికి వెళ్లాలన్న, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు కాలినడకన పట్టాలు దాటే వెళ్లాలి. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సైతం పట్టాలు దాటి వెళ్లి, సాయంత్రం మళ్లీ పట్టాలు దాటి తిరిగి రావాల్సిందే. ప్రమాదమని తెలిసినా పట్టాలు దాటడం తప్ప ప్రత్యామ్నాయం లేదు.

ఆర్వోబీపై కాలినడక ఇబ్బంది..

దాదాపు కిలో మీటరు ఉన్న ఆర్వోబీ చాలా ఇరుకుగా ఉంటుంది. దీంతో అటు ఇటు వెళ్లే వాహనాల రద్దీ వల్ల నడిచి వెళ్లే వారికి ఇబ్బందికరంగా ఉంటుంది. 200 మీటర్లు నడిచి పట్టాలు దాటితే చాలు కొత్త బస్టాండ్ నుంచి పాతబస్టాండ్ చేరుకోవచ్చు.

పశువులకు ఇబ్బందే..

రైల్వేగేటు మూయడం వల్ల పశువులను పొలాలకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. రైతులు పశువులను పట్టాలు దాటించే వరకు భయంతో వెళ్తున్నారు. గొర్రెల కాపరులు తమ మందను పట్టాలు దాటించడానికి ఇబ్బందులు పడుతున్నారు. దేవరకద్రలో సంతకు కోయిల్‌సాగర్, మరికల్, కౌకుంట్ల వైపు నుంచి వచ్చే పశువులను వాహనాల్లో తేవడం లేదు. గేటు సమస్య కారణంగా దేవరకద్ర పట్టణంలోని ప్రజలు, వ్యాపారులు, విద్యార్థులు, ఇతర గ్రామాల వారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

అండర్‌పాస్‌పై రాని స్పష్టత..

గేటు మూయడంతో కనీసం అండర్‌పాస్ అయినా నిర్మిస్తే పట్టణ ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, మూతపడ్డ షాపులు, బస్టాండ్ తిరిగి తెరుచుకునే అవకాశం ఉంటుందని ప్రజలు సమస్యను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ డీకే అరుణ వచ్చి స్వయంగా గేటు వద్ద సమస్యను పరిశీలించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పలుమార్లు గేటును పరిశీలించి వ్యాపారులు, ప్రజలతో మాట్లాడారు. సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంకు వినతిపత్రం ఇచ్చి సమస్య పరిష్కరించాలని కోరారు. ఇటీవల దేవరకద్రకు వచ్చిన జీఎంకు మరోసారి వినతిపత్రం ఇచ్చారు. అయిన అండర్‌పాస్‌పై స్పష్టత రాలేదు. దేవరకద్ర పట్టణాన్ని ఒకటిగా కలిసే విధంగా అనుసంధానం చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని, మూసిన బస్టాండ్‌లోకి బస్సులు నడిచేలా చూడాలని, అండర్‌పాస్ నిర్మించాలని, లేదా రైల్వేగేటును తెరిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హామీ నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలి. దేవరకద్ర ప్రజలు ఏడాదిన్నర కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా అండర్ పాస్ నిర్మించాలి. సర్వే చేయిస్తామని రైల్వే జీఎం చెప్పినా అమలు చేయలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి. – సాంబశివుడు, టీయూసీఐ నాయకులు, దేవరకద్ర

వ్యాపారానికి దెబ్బ..



రైల్వేగేటు మూసిన తర్వాత దేవరకద్రలో వ్యాపారానికి పెద్ద దెబ్బ పడింది. గేటుకు రెండు వైపుల దాదాపు రెండు వందల మీటర్ల మేర షాపులు అన్నీ మూతపడ్డాయి. ఇక బస్టాండ్ పూర్తిగా నిర్మానుష్యంగా మారింది. గ్రామాల ప్రజలు గేటు వద్ద వాహనాలు నిలిపి పట్టాలు దాటుతున్నారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు పట్టాలపై నడవాల్సిన పరిస్థితి ఉంది. వెంటనే అండర్ పాస్‌ను ఏర్పాటు చేయాలి. – కిషోర్, వ్యాపారి, దేవరకద్ర

సమస్యల పరిష్కారం కోసం రిజిస్ట్రార్‌కు వినతి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్టు అధ్యాపకులు పీయూ రిజిస్ట్రార్ చెన్నప్పకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు నాయకులు మాట్లాడుతూ వర్క్‌లోడ్ పాత పద్ధతిలో 96 క్రెడిట్స్ ఉంచాలని, 80:20 విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ స్పందిస్తూ క్రెడిట్స్‌పై లోతుగా పరిశీలించి కసరత్తు చేయాలని, సమస్యపై పూర్తి అవగాహన ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో అర్జున్‌కుమార్, రవికుమార్, శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పర్వతాలు, వెంకటేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. సమగ్రశిక్ష అభియాన్‌లో కనీస వేతనం చట్టం అమలు కావడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20వేల మందితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని అన్నారు. వారిని రెగ్యులరైజ్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని.. మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు, ఇతర వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

నేత్రపర్వం.. ధ్వజారోహణం


ఆదిశిలా క్షేత్రంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

- భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ అధికారుల సమక్షంలో ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు రమేషాచారి, మధుసూధనాచారి, ప్రసన్నచారి, భీంసేనాచారి, ధీరేంద్రదాసు, శశాంక్ ఆగమ పద్ధతిలో స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల కంటే ముందు ధ్వజారోహణంతో దేవతామూర్తులను ఆహ్వానించి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు కలగకుండా విజయవంతం కావాలని కోరినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అదే విధంగా సంతానం లేని మహిళలకు ధ్వజారోహణం రోజు అర్చకులు ప్రసాదాన్ని అందజేశారు. ప్రతి ఏటా ధ్వజారోహణం రోజున వివిధ పట్టణాలు, గ్రామాలకు చెందిన సంతానం కానీ మహిళలు ఆలయానికి పెద్దసంఖ్యలో చేరుకుని స్వామి వారి ప్రసాదం పొందడం భక్తుల నమ్మకం. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజు శర్మ, బాబురావు, మండల నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, నరేందర్, సవారి, వాల్మీకీ పూజారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు ప్రసాదం పంపిణీ చేస్తున్న అర్చకులు

తెగుళ్ల నివారణకు ఎన్‌పీఎస్‌ఎస్ యాప్ సేవలు


మొబైల్ అప్లికేషన్‌పై అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర అధికారులు

ఎర్రవల్లి: పంటలను ఆశించిన తెగుళ్ల నివారణకు ఎన్‌పీఎస్‌ఎస్ మొబైల్ యాప్ (నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం) సేవలు ఉపయోగపడతాయని, పంట ఖర్చులు తగ్గుతాయని హైదరాబాద్ సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు సునీత, వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పుటాన్‌దొడ్డి రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ ఆధ్వర్యంలో ఈ మొబైల్ అప్లికేషన్‌పై జిల్లాలోని ప్రగతిశీల రైతులకు, వ్యవసాయశాఖ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఈ యాప్‌ను ఉపయోగించడం ద్వారా ఎలాంటి ఆలస్యం లేకుండా తెగులును సులభంగా గుర్తించడం, తక్షణ నియంత్రణ చర్యలను అనుసరించవచ్చునని అన్నారు. పంటలో తెగులును పర్యవేక్షించడానికి ఎంతో ఉపయోగపడతుందని అన్నారు. అనంతరం స్థానిక రైతులు సాగు చేసిన కంది, మిరప పంటల్లో క్షేత్ర సందర్శన ద్వారా ప్రత్యక్ష ప్రదర్శనను నిర్వహించి రైతులకు, అధికారులకు దాని ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉదయ్‌శంకర్, మండల అధికారి రవికుమార్, ఏఓలు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కారును ఢీ కొట్టిన ఆటో

నలుగురికి తీవ్ర గాయాలు

దేవరకద్ర రూరల్: ఆగి ఉన్న కారును ఆటో ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక వివరాల ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన ఆటోలో ప్రయాణికులు దేవరకద్ర నుంచి నాగారం వెళ్తుండగా బస్వాపూర్ స్టేజీ సమీపంలో నిలిచి ఉన్న కారును వెనక నుంచి ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో ప్రయాణికులపై పడటంతో లంబాడి రాజు, మ్యాదరి కొండమ్మ, ఆంజనేయులు, శ్రీలతలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు, పోలీసులు 108లో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.


ప్రమాదంలో బోల్తా పడిన ఆటో

సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన కిషోర్‌కుమార్

గద్వాలటౌన్: ప్రతిష్టాత్మకమైన సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలకు గద్వాలకు చెందిన యువ క్రీడాకారుడు కిషోర్‌కుమార్ ఎంపిక య్యారు. ఈ నెల 14 నుంచి 23 వరకు హైదరాబాద్‌లో 78వ జాతీయస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ సంతోష్ ట్రోఫీ పోటీలు జరగనున్నాయి. మంగళవారం సంతోష్ ట్రోఫీ కోసం 22 మంది క్రీడాకారులతో తెలంగాణ రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. జట్టులో గద్వాలకు చెందిన క్రీడాకారుడు కిషోర్‌కుమార్ ఉండటం గర్వకారణం. సంతోష్ ట్రోఫీ కోసం గత అక్టోబర్‌లో ప్రాబబుల్స్ ఎంపిక పోటీలు నిర్వహించి 50 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. తరువాత వారికి నెల రోజుల పాటు హైదరాబాద్‌లోని శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో శిక్షణ ఇచ్చారు. ప్రాబబుల్స్ పోటీలలో అత్యంత క్రీడా నైపుణ్యం కనబర్చిన కిషోర్‌కుమార్‌ను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. సంతోష్ ట్రోఫీకి కిషోర్ కుమార్ ఎంపికపై ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఇంటెలిజెన్స్ సీఐ నర్సింహరాజు, కౌన్సిలర్లు త్యాగరాజు, బండల పాండు, సీనియర్ క్రీడాకారులు జగన్, తిరుమల్, రమణ హర్షం తెలిపారు.

అడవి జంతువు మాంసం పట్టివేత

లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కొంత మంది వ్యక్తులు రహస్యంగా తీసుకొస్తున్న అడవి జంతువు మాంసాన్ని మంగళవారం అటవీశాఖ అధికారులు పట్టుకొని స్వాధీన పర్చుకున్నారు. లింగాల రేంజ్ పరిధిలోని అంబగిరి నుంచి కొంత మంది వ్యక్తులు సంచిలో మాంసం తీసుకొస్తుండగా, అటవీశాఖ అధికారులను గమనించిన పరారయ్యే ప్రయత్నం చేశారు. దీంతో అనుమానించి వారిని పట్టుకొని సోదాచేయగా మాంసం లభ్యమైంది. అధికారులు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై డీఆర్‌ఓ జయదేవ్‌ను వివరణ కోరగా విచారణ జరుపుతున్నామని, త్వరలో పూర్తి సమాచారం ఇస్తామని తెలిపారు.

బిర్యానీలో బొద్దింక

నాగర్‌కర్నూల్ క్రైం: రెస్టారెంట్‌లో బిర్యానిని తినేందుకు వచ్చిన వ్యక్తికి అందులో బొద్దింక వచ్చిన ఘటన జిల్లా కేంద్రంలోని ఓ రెస్టారెంట్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన విష్ణు పట్టణంలోని నల్లవెల్లిరోడ్డులో బిర్యాని తినేందుకు వచ్చాడు. బిర్యానిలో బొద్దింక కనిపించడంతో రెస్టారెంట్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగాడు. ఘటనపై ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ మనోజ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గడ్డివాముకు నిప్పు

అచ్చంపేట రూరల్: మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన రైతు శేఖర్ వ్యవసాయ పొలంలో గడ్డివాముకు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. బాధితుడి వివరాల మేరకు.. రోజుమాదిరిగానే వ్యవసాయ పనులు ముగించుకుని శేఖర్ ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికాగానే గడ్డివాముకు నిప్పుపెట్టారు. దీన్ని గమనించిన ఇరుగు పొరుగు రైతులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే లోపే సగానికి పైగా కాలి బూడిదైంది. సుమారు రూ. 1లక్ష వరకు నష్టం వాటిల్లింది. నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు కోరాడు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

కోస్గి: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం గుండుమాల్ మండల కేంద్రంలో రాష్ట్ర స్థాయి అండర్–19 వాలీబాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఏకే స్పోర్ట్స్ అకాడమీ క్రీడా మైదానంలో ప్రారంభమైన ఈ పోటీలకు ఉమ్మడి 10 జిల్లాల నుంచి బాలబాలికల జట్లు హాజరయ్యాయి. ఈ పోటీలను డీఐఈఓ సుదర్శన్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మధుకర్ రావు, మాజీ జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అన్న కిష్టప్ప, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

మొదటి రోజు మహబూబ్‌నగర్ జట్లు విజయం

మొదటి రోజు పోటీల్లో మహబూబ్‌నగర్ బాలికల జట్టు, బాలుర జట్టు విజయం సాధించి శుభారంభం చేశాయి. హైదరాబాద్ జట్టుపై మహబూబ్‌నగర్ బాలికల జట్టు 15–4, 15–9 స్కోర్‌తో విజయం సాధించింది. నల్గొండ జట్టుపై మహబూబ్‌నగర్ బాలుర జట్టు 25–11, 25–11 స్కోర్‌తో విజయం సాధించింది. ఇదే క్రమంలో బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టుపై నిజామాబాద్ విజయం సాధించింది. బాలికల విభాగంలో నల్గొండ జట్టుపై నిజామాబాద్ జట్టు వియం సాధించింది. రంగారెడ్డి జట్టుపై మెదక్ బాలికల జట్టు విజయం సాధించింది. వరంగల్ జట్టుపై ఖమ్మం బాలికల జట్టు విజయం సాధించాయి. ఉమ్మడి ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ పాపిరెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాల్‌రాజ్, మండల పీడీ శ్రీనివాస్, పీడీలు నర్సింహులు, స్వప్న, రాధిక, పుష్పలత పాల్గొన్నారు.

మొదటి రోజే మహబూబ్‌నగర్ జట్ల విజయం

టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి..

- ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్
- యువకుడి దుర్మరణం


బస్సు కిందుకు దూసుకెళ్లిన బైక్


ప్రశాంత్ (ఫైల్)

మంచాల: టిప్పర్‌ను ఓవర్‌టేక్ బోయిన ద్విచక్ర వాహనదారుడు ఆగిఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మంచాల సీఐ మధు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండకు చెందిన కొమ్ము ప్రశాంత్‌కుమార్(24) స్థానికంగా ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి నగరంలో పని ఉందని చెప్పి యజమాని శ్రీశైలం బైక్ తీసుకుని హైదరాబాద్‌కు బయలుదేరాడు. సాగర్ హైవేపై ఆగాపల్లి వద్దకు రాగానే టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఎదురుగా ఆగిఉన్న ఇబ్రహీంపట్నం డిపో బస్సును ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఇబ్రహీంపట్నంలోని లిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నగారానికి తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రశాంత్ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్లుప్తంగా...

17 నుంచి శ్రీవారికి తిరుప్పావై

16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం

తిరుమల: తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 16న ప్రారంభం కానుంది. ఆరోజు ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డిసెంబరు 17 నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. జనవరి 14తో ధనుర్మాస ఘడియలు ముగియనున్నాయి. ఈసందర్భంగా శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వ పత్రాలతో సహస్ర నామార్చన చేస్తారు. శ్రీవిల్లి పుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. విశేష నైవేద్యాలుగా దోశ, బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ వంటి ప్రసాదాలను నివేదిస్తారు.

రద్దీ రోజుల్లోనూ మల్లన్న స్పర్శ దర్శనం

శ్రీశైలం టెంపుల్: రద్దీ రోజుల్లోనూ శ్రీశైల మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తూ దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలువురు భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రతి శని, ఆది, సోమవారాల్లో, ప్రభుత్వ సెలవు దినాలు తదితర రద్దీ రోజుల్లోనూ నిర్దిష్ట వేళల్లో మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, రాత్రి 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మల్లన్న స్పర్శదర్శనం ఉంటుందన్నారు. గతంలో మాదిరిగానే స్పర్శ దర్శనం టికెట్లను కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పొందాల్సి ఉంటుందన్నారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా సాంబశివారెడ్డి



సాక్షి, హైదరాబాద్: డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా సాంబశివారెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఆయన అదే విభాగం జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జి.వైజయంతి గత నెల 30న పదవీ విరమణ చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

'సానా'కు శానా చేస్తున్నారు..

రాజ్యసభ అవకాశం ఇవ్వడంపై టీడీపీలో తీవ్ర విమర్శలు

- ఒత్తిళ్లకు సీఎం చంద్రబాబు లొంగిపోయారని నేతల ఆగ్రహం
- సీబీఐ, ఈడీ కేసులున్న వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ఆందోళన
- కొత్త నేతను అందలం ఎక్కిస్తే తమ పరిస్థితి ఏమిటని సీనియర్ల నిలదీత
- ఎవరెన్ని చెప్పినా అలాంటి నేతలే అవసరమని సీఎం స్పష్టీకరణ



సాక్షి, అమరావతి : మనీ లాండరింగ్, హవాలా కేసులు సహా సీబీఐనే వివాదంలోకి లాగిన చరిత్ర ఉన్న సానా సతీష్‌కు సీఎం చంద్రబాబు రాజ్యసభ సీటు ఇవ్వడంపై ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. లాబీయింగ్, అవినీతి వ్యవహారాలతో అంటకాగే వ్యక్తికి కీలక పదవి ఇవ్వడం సరికాదంటూ టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో, వ్యక్తిగత సంభాషణల్లో విరుచుకుపడుతున్నారు. పార్టీ కోసం సుదీర్ఘ కాలం నుంచి పని చేసిన వారిని పట్టించుకోకుండా కొత్తగా పార్టీలోకి వచ్చి పెత్తనం చెలాయిస్తున్న సానా సతీష్‌కు ఉన్నత పదవి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఆయనకు పదవి ఇస్తున్నారని కొన్ని రోజుల క్రితమే తెలియడంతో చాలా మంది ముఖ్య నేతలు చంద్రబాబును కలిసి తమ అసంతృప్తి వెలిబుచ్చారు. ఎంతో మంది సీనియర్లు ఉండగా, తీవ్ర స్థాయి ఆరోపణలున్న వ్యక్తిని పరిగణనలోకి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే తమ లాంటి సీనియర్ల పరిస్థితి ఏమిటని.. క్యాడర్‌కు, నాయకులకు ఏం సమాధానం చెప్పాలని అడిగినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో, అంతకు ముందు.. పార్టీకి భారీగా నిధులు ఇచ్చిన వారికి ఇప్పుడు న్యాయం చేయక తప్పదని ఆయన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. లోకేశ్ పాదయాత్రలో సతీష్ లాంటి నేతలు చాలా ఉపయోగపడ్డారని, వారు డబ్బు ఖర్చు చేశారు కాబట్టే అధికారంలోకి వచ్చాక ప్రతిఫలం ఇస్తున్నామని స్పష్టం చేసినట్లు.. అంతటితో ఆగకుండా పార్టీలో కొత్త తరానికి అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసినట్లు తెలిసింది. చంద్రబాబు స్పందించిన తీరుతో సీనియర్ నాయకుల్లో ఇంకా ఆగ్రహం పెరిగిపోయింది. పార్టీ చంద్రబాబు చేతుల్లో లేదని, లోకేశ్ కోటరీ చేతుల్లో ఉందని చర్చించుకుంటున్నారు. లోకేశ్ కోటరీలో అత్యంత కీలకంగా ఉంటూ బదిలీలు, కాంట్రాక్టులు సహా అన్ని వ్యవహారాలను సానా సతీష్ చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో ఆయన పేరును రాజ్యసభ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు ప్రకటించక తప్పలేదంటున్నారు.

విస్తుగొలిపే తీవ్ర ఆరోపణలు

- సానా సతీష్‌పై మనీ లాండరింగ్ అభియోగాలుండడంతో సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. ఈ కేసులకు సంబంధించి 2019 జూలైలో ఆయన్ను ఈడీ అరెస్టు చేసి జైలుకు పంపింది.
- మనీ లాండరింగ్, హవాలా కేసుల్లో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మీట్ వ్యాపారి మొయిన్ ఖురేషీతో సతీష్‌కు సన్నిహిత సంబంధాలున్నట్లు తేలింది. ఖురేషీతో కలిసి అక్రమ వ్యాపారాలు కూడా చేసినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే తనపై ఉన్న మనీ లాండరింగ్ కేసుల నుంచి తప్పించుకునేందు ఖురేషీ ద్వారా సీబీఐ అధికారులకు సతీష్ లంచం ఇచ్చినట్లు స్పష్టమైంది.
- అదే సమయంలో సీబీఐ డైరెక్టర్‌గా పని చేసిన రాకేష్ ఆస్థానా, మరో సీబీఐ అధికారి అలోక్ వర్మ మధ్య చిచ్చుపెట్టి.. ఏకంగా సీబీఐనే వివాదంలోకి లాగిన చరిత్ర సతీష్‌ది. తనను కేసు నుంచి తప్పించేందుకు సీబీఐ డిప్యూటీ డైరెక్టర్ రాకేష్ ఆస్థానాకు రూ.2 కోట్లు లంచం ఇచ్చినట్లు స్పష్టమవడంతో ఈడీ అధికారులు ఆయన్ను అరెస్టు చేశారు.
- తనపై ఉన్న ఆరోపణలను కొట్టేయాలంటూ ఈ ఏడాది జులైలో సానా సతీష్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా దాన్ని కోర్టు కొట్టివేసింది. ఇలా తీవ్ర స్థాయి ఆరోపణలున్న వ్యక్తిని విచారించాల్సిందేనని స్పష్టం చేసింది.

సబ్ ఇంజినీర్ నుంచి కోట్లకు పడగలెత్తి..

- కాకినాడకు చెందిన సానా సతీష్ మొదట్లో విద్యుత్ శాఖలో సబ్ ఇంజినీర్‌గా పని చేశారు. ఉద్యోగం వదిలేశాక అక్రమ వ్యాపారాలతో కోట్లు కూడబెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే మనీ లాండరింగ్, హవాలా కేసులు నమోదయ్యాయి. అలాంటి వ్యక్తి చంద్రబాబు తనయుడు, మంత్రి లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు.
- అక్రమంగా సంపాదించిన డబ్బును ఖర్చు చేసి వారికి బాగా దగ్గరయ్యారు. లోకేశ్ పాదయాత్ర ఖర్చును చాలా వరకు సతీష్ భరించినట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు. గత ఎన్నికల్లో భారీగా డబ్బు సమకూర్చినట్లు తెలిసింది. చాలా వ్యవహారాల్లో లోకేశ్ వెన్నంటే ఉండి అన్నీ సమకూర్చినట్లు చెబుతున్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా అవతరించారు.
- మంత్రి పదవులు, ఉన్నతాధికారుల పోస్టింగ్‌లు, బదిలీలు, కాంట్రాక్టులు ఇతర అనేక వ్యవహారాల్లో ఆయన ప్రమేయం ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పదవి ఆయన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఇప్పుడు ఏకంగా కాకలు తీరిన సీనియర్ నేతలను కాదని రాజ్యసభ సీటునే తన్నుకుపోయారు.

అది విప్లవాత్మక ఆవిష్కరణ

గుండె వాల్వ్‌ల చికిత్సలో 'మైవాల్ ఆక్టోప్రో'పై కార్డియాలజిస్టులు

సాక్షి, హైదరాబాద్: 'మైవాల్ ఆక్టో ప్రో ట్రాన్స్ క్యాథెటర్ హార్ట్ వాల్వ్' అనే ఉపకరణం గుండె చికిత్సల్లో విప్లవాత్మక మార్పు తెస్తుందని కార్డియాలజిస్టులు అభిప్రాయపడ్డారు. ఈ ఉపకరణాన్ని కనుగొనడం గుండె చికిత్సల్లో కీలక మైలురాయిగా అభివర్ణించారు. నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇటాలియన్ సొసైటీ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ, పీసీఆర్ లండన్ వాల్వ్స్–2024 వంటి అంతర్జాతీయ వేదికలపై ఓ భారత కంపెనీ ఉపకరణాన్ని పలువురు కొనియాడటం భారతీయులకు ఎంతో గర్వకారణమని చెన్నైకు చెందిన డాక్టర్ అనంతరామన్, డాక్టర్ జాన్ జోస్, డాక్టర్ సెంగొట్టువేలు ప్రశంసించారు. గుండె చికిత్సల ఉపకరణాలను అభివృద్ధి చేస్తున్న 'మెరిల్ లైఫ్ సైన్సెస్' సంస్థ ఆధ్వర్యంలో ఈ ఉపకరణం రూపుదిద్దుకుంది. ఈ ఉపకరణం ద్వారా గుండెను పూర్తిగా తెరవకుండానే చిన్న గాటుతో 'అయోర్టిక్ వాల్వ్'లో వచ్చే లోపాలకు చికిత్స అందించవచ్చని మెరిల్ లైఫ్ సైన్సెస్ ఓ ప్రకటనలో పేర్కొంది.

14న దుర్గమ్మ కలశజ్యోతి మహోత్సవం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు కలశజ్యోతి మహోత్సవం జరగనుంది. మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు విజయవాడ, సత్యనారాయణపురం శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి భవానీలు, అమ్మవారి భక్తులు జ్యోతులను పట్టుకుని ఇంద్రకీలాద్రికి వస్తారు. భవానీలు తమ కలశజ్యోతులను కనకదుర్గ నగర్‌లో సమర్పించడంతో పాటు మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. కలశ జ్యోతుల నేపథ్యంలో శనివారం రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం కల్పిస్తారు.

ప్రశ్నిస్తే పనిపడతా!

- బీసీ నేతల మధ్య చంద్రబాబు చిచ్చు
- కేవీ రావుకు వ్యతిరేకంగా యనమల లేఖాస్త్రం
- దీనిపై రెడ్డి సుబ్రహ్మణ్యం ఘాటు వ్యాఖ్యలు
- ఇదంతా సీఎం సూచనల మేరకే అంటున్న నేతలు
- యనమల టార్గెట్‌గా సోషల్ మీడియాలోనూ పోస్టులు



సాక్షి, అమరావతి : రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగించే చంద్రబాబు ఇప్పుడు పార్టీలోని ఇద్దరు బీసీ నేతల మధ్య చిచ్చు పెట్టారు. సుదీర్ఘ కాలం నుంచి తనకు బలమైన మద్దతుదారుగా ఉన్న సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలను జీర్ణించుకోలేక ప్రశ్నించడంతో ఆయనపైకి మరో సీనియర్ నేత, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంను ఉసిగొల్పినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. అంతేకాకుండా టీడీపీ సోషల్ మీడియా కూడా యనమలకు వ్యతిరేకంగా తీవ్ర స్థాయి ఆరోపణలతో ట్రోల్ చేస్తోంది. దీనికంతటికీ కాకినాడ పోర్టు వ్యవహారంలో చంద్రబాబు వైఖరికి విరుద్ధంగా యనమల రామకృష్ణుడు ఆయనకు లేఖ రాయడమే కారణం. కాకినాడ పోర్టుకు చెందిన కేవీ రావు చౌదరికి చంద్రబాబు మద్దతు పలుకుతూ రాజకీయంగా ఆయన్ను పావులా వాడుకుంటున్నారు. కానీ యనమల మాత్రం తాను రాసిన లేఖలో కేవీ రావు చౌదరి కాకినాడ సెజ్ భూముల ద్వారా వేల కోట్ల లబ్ధి పొందారని.. బీసీ, మత్స్యకార రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. తనను ధిక్కరిస్తూ లేఖ రాయడంతో చంద్రబాబు.. యనమలను ప్రశ్నించకుండా ఇతర బీసీ నేతలను ఆయనపైకి ప్రయోగించినట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే రెడ్డి సుబ్రహ్మణ్యం బహిరంగంగా యనమల రామకృష్ణుడిపై ఆరోపణలు గుప్పించారు. 40 ఏళ్లుగా యనమల బీసీల గురించి పట్టించుకోలేదని, ఇప్పుడు తనకు పదవి ఇవ్వలేదనే కారణంతో చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయనకు తోడుగా మరికొందరు కింది స్థాయి నేతలు కూడా యనమలపై విమర్శలు చేశారు. టీడీపీ సోషల్ మీడియా అయితే యనమల పార్టీలో ఉన్న విషయాన్ని కూడా మరచిపోయి ఆడేసుకుంటోంది.

చంద్రబాబుకు తెలియకుండానే తిడతారా?

పార్టీలో తన స్థాయి ఉన్న ఒక సీనియర్ బీసీ నాయకుడిని, మరో సీనియర్ బీసీ నాయకుడు బహిరంగంగా తిట్టారంటే అందుకు చంద్రబాబు పరోక్ష అనుమతి కచ్చితంగా ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యనమలకు వ్యతిరేకంగా పార్టీలోనే ఇంత జరుగుతున్నా, చంద్రబాబు స్పందించక పోవడాన్ని బట్టి ఆయన అభిమతం ప్రకారమే ఇదంతా జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. మరోవైపు కొందరు బీసీ నేతలు యనమలకు మద్దతుగా మాట్లాడుతున్నారు. చంద్రబాబుకు ఆది నుంచి తోడు, నీడగా ఉన్న నాయకుడిని ఇలా అవమానించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా పార్టీలోనే బీసీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి కొట్లాడుకునే పరిస్థితి ఏర్పడినా, చంద్రబాబు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం టీడీపీలో జరుగుతున్న పరిణామాల పట్ల యనమల రామకృష్ణుడు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనలాంటి సీనియర్లను పూర్తిగా పక్కన పెట్టేయడంతో ఆయన ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దీనికితోడు కాకినాడ పోర్టు, సెజ్ విషయంలో కేవీ రావు చౌదరికి అనుకూలంగా వ్యవహరించడం, రాజ్యసభ స్థానాలను లాబీయిస్టులకు కట్టబెడుతుండడంతో తట్టుకోలేక ఆయన తొలిసారిగా చంద్రబాబును ధిక్కరించి లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడం నుంచి చంద్రబాబుతో కలిసి పని చేసిన యనమల లాంటి నాయకుడు తిరుగుబాటు స్వరం వినిపించడంతో పార్టీలో గందరగోళం నెలకొంది.

హనుమద్ దీక్ష విరమణ ఉత్సవాలు



మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయం



స్వామివారి మూల విగ్రహం

మద్దిమడుగు క్షేత్రంలో నేటి నుంచి 15వ తేదీ వరకు..

- 26న హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం

అచ్చంపేట: తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒక్కటైన మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి దీక్ష విరమణ ఉత్సవాలు బుధవారం నుంచి 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి. నల్లమల కొండల్లో ప్రవహించే కృష్ణా, పశ్చిమ భాగాన దుందుభి నది సంఘమించే ప్రాంతంలో 12 కిలోమీటర్ల దూరంలో ప్రకృతి రమణీయ ప్రదేశంలో ఈ ఆలయం ఉంది. ప్రతి ఏడాది కార్తీక మాసంలో దీక్ష విరమణ, చైత్రమాసంలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు ఆంజనేయస్వామి మాల ధరిస్తారు. 40 రోజుల పాటు దీక్ష అనంతరం ఇరుముడులతో ఆలయానికి చేరుకొని ముడుపులు స్వామివారికి సమర్పించి విరమణ పొందుతారు.

ఆలయ చరిత్ర..

పదర మండలం నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలో శ్రీశైల క్షేత్రానికి ఉత్తర దిక్కున మద్దిమడుగు ఆంజనేయస్వామి క్షేత్రం ఉంది. ఈ ఆలయాన్ని క్రీ.శ. 1120లో గుర్తించినట్లు చారిత్రక ఆధారాలను బట్టి పూర్వీకులు చెబుతున్నారు. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచేగాక మహబూబ్‌నగర్, నల్గొండ, హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, గుంటూరు, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి దీక్ష ధారులు, భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

అయిదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో దీక్షా ధారులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మాల విరమణ భక్తులకు ప్రత్యేక షెడ్లు, తాగునీటి కోసం సింథటిక్ మినీ ట్యాంకులు, ఉన్న స్నానఘట్టాలతో పాటు అదనంగా మరో 24 స్నాన ఘట్టాలను నిర్మించారు. పదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా మాచర్ల, దేవరకొండ, మిర్యాలగూడ, అచ్చంపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్ డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది.

రోజువారీ కార్యక్రమాలు..

- బుధవారం ఉదయం నిత్యారాధన, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, యాగశాల ప్రవేశం.
- 12న విఘ్నేశ్వర పూజ, పంచగవ్యం, వాస్తుపూజ, హోమం, రుద్ర హోమం, సహస్రనామార్చన, బలిహరణం, నీరాజన మంత్రపుష్పం, నిత్య ఉపాసన, మనుసూక్త హోమం, బలిహరణం, తీర్థ ప్రసాద వితరణ, రాత్రి అశ్వవాహనసేవ.
- 13న విఘ్నేశ్వర, గవ్యాంత పూజలు, రుద్ర హోమం, నిత్య ఉపాసన, బలిహరణం, మహానివేదన, నీరాజన మంత్ర పుష్పములు, రాత్రి శివపార్వతుల కల్యాణం.
- 14న విఘ్నేశ్వర, గవ్యాంతర పూజలు, రుద్ర హోమం, నిత్య ఉపాసన, హనుమద్ వ్రతం, తీర్థ ప్రసాద వితరణ, రాత్రి సీతారాముల కల్యాణం 15న గవ్యాంత పూజలు, మనుసూక్తములతో ఆంజనేయస్వామికి 108 కలశాలతో మహా కుంభాభిషేకం, హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం, పూర్ణాహుతి.

భళా.. భాస్కరా..!

చేసే పనిలో నిబద్ధత.. కొత్తదనం కోసం ప్రయత్నిస్తే మంచి ఫలితాలు వస్తాయి. తనలో ఉన్న ప్రతిభకు వినూత్న పంథాను జోడించి సరికొత్త రూపంలో చిత్రాలు గీస్తూ అందరినీ అబ్బురపరుస్తున్నారు నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన భాస్కర్ హాదేకర్. ప్రకృతి, దేవతలు, జంతువులు, పక్షులు, రాజకీయ నేతల చిత్రాలతో భళా అనిపించుకుంటున్నారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్

చిత్రలేఖనంలో ఉదయించిన 'భాస్కరుడు'	బాల్యం నుంచే బొమ్మలు గీయడంపై ఆసక్తి	ఆయన కుంచె నుంచి జాలువారిన అద్భుత చిత్రాలు



గ్రీటింగ్‌కార్డును అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి అందజేస్తున్న భాస్కర్ హాదేకర్ (ఫైల్)


లోకల్ టాలెంట్


భాస్కర్ కుంచె నుంచి జాలువారిన చిత్రాలు అద్భుతం. గీసిన ప్రతి బొమ్మ జీవం పోసుకుంటుంది. చిన్నతనం నుంచే ఖాళీ సమయం దొరికిన ప్పుల్లా పెన్సిల్‌తో బొమ్మలు గీయడం ఆయనకు ఇష్టంగా మారింది. ఈ బొమ్మలు అందంగా, అద్భుతంగా, సహజత్వానికి దగ్గరగా ఉండడంతో పలువురి ప్రశంసలు పొందారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు సాధించారు. నాగర్‌కర్నూల్‌లో ఇంటర్ పూర్తి చేసిన భాస్కర్ ఆ తర్వాత పాలెంలో డిగ్రీ చదివారు. అనంతరం హైదరాబాద్‌లో డ్రాయింగ్ టీచర్‌గా తాత్కాలిక ఉద్యోగం చేస్తూ ఎంతో మంది విద్యార్థులకు చిత్రలేఖనంపై మక్కువ పెంచేలా చేశారు. అదే సమయంలో 2006 సంవత్సరంలో తన వద్ద నేర్చుకున్న విద్యార్థులతో పెద్ద గ్రీటింగ్స్ కార్డును రూపొందించి అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి అందజేసి శెభాష్ అనిపించుకున్నారు.


- భాస్కర్ పెన్సిల్, ఆయిల్‌తో అద్భుతమైన పెయింటింగ్స్ వేస్తున్నారు. దేశ నాయకులు, సినీ హీరోలు, రాజకీయ నాయకుల చిత్రాలు గీసి తన అభిరుచిని చాటుకుంటున్నారు. ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు చిత్రాన్ని గీసిన ఆయనకు అందజేసి ప్రశంసలు సైతం అందుకున్నారు. హైదరాబాద్‌లో 2006 సంవత్సరంలో ఐడియా సుమో వారితో కలిసి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 2010లో జేఎన్‌టీయూ నుంచి మల్టీమీడియాలో బీఎఫ్‌ఏ పూర్తి చేశారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడే తాను చేసిన పాత్రలు వరల్డ్ వైడ్ యానిమేషన్ టుడే పుస్తకంలో ప్రచురితం కావడం విశేషం. ప్రభుత్వం నిర్వహించిన చిత్రలేఖన ఉద్యోగ ఎంపికలో రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంకు సాధించి చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం భాస్కర్ హైదరాబాద్‌లో టీజీఎంఆర్‌ఈఐఎస్‌లో గోషామహల్ బాలుర–1 పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం తన లాగే ఎంతో ప్రతిభ ఉన్న విద్యార్థులను గొప్ప చిత్రకారులుగా తీర్చదిద్దేపనిలో ఉన్నారు.
- భాస్కర్‌కు యానిమేషన్ రంగంలో కూడా విశేషమైన అనుభవం ఉంది. యానియేషన్ డిక్యూలో 14 సంవత్సరాలు పనిచేశారు. జంగిల్ బుక్ సిరీస్, లేడి బగ్, మిక్కీమౌస్ వంటి పలు సిరీస్‌లలో పనిచేశారు. ఈగ, బాహుబలి సినిమాలకు ఫ్రీలాన్సర్‌గా పని చేయడం విశేషం. వరల్డ్ వైడ్ యానిమేషన్ పుస్తకంలో ఇతని చిత్రాలు ప్రచురితమయ్యాయి.


ఉన్నతస్థాయికి ఎదగాలి..

చిన్నప్పటి నుంచే బొమ్మలు గీయడం అంటే ఎంతో ఇష్టం. ఇటు చిత్రలేఖనంతో పాటు అటు పలు తెలుగు సినిమాలకు ఫ్రీలాన్సర్‌గా పనిచేశాను. ఆర్టిస్టుగా ఉన్నతస్థాయికి చేరేలా నిరంతరం శ్రమిస్తున్న. భవిష్యత్‌లో నేను గీసిన చిత్రాలతో పట్టణాల్లో ప్రదర్శనలు నిర్వహించాలనే ఆలోచనతో ఉన్నారు. – భాస్కర్ హాదేకర్, చిత్రకారుడు









భాస్కర్ గీసిన చిత్రాలు



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాన్ని గీస్తున్న భాస్కర్

జూరాలకు 170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ప్రాజెక్టుకు 170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలలో ఒక పంపు ద్వారా నీటి పంపింగ్‌ను కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 69 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ 158 క్యూసెక్కు లు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 412 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 392క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,779 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 8.631 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలం జలాశయంలోకి 9,716 క్యూసెక్కులు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం లోకి 24గంటల వ్యవధిలో 9,716 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,632, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 1.748 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. మంగళవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 864.4 అడుగుల వద్ద 116.9480 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాయంత్రం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడులో మంగళవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 390 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 412 క్యూసెకుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 949 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 40 క్యూసెక్కులు, వివి ధ లిఫ్టుల ద్వారా 392 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కర్నూల్ జిల్లా ఆదోనికి చెందిన షేక్ అబ్దుల్లా కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొమిరెడ్డిపల్లి శివారులోని పెట్రోల్ పంపు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం కారును ఢీకొట్టింది. కారులో ఉన్న షేక్ అబ్దుల్‌తోపాటు మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు.